# పురాణకథలు



## 'ఓం' ప్రణవ నాదం

### ఈ సృష్టికి మూలాధారమైన ఆ నాదం సృష్టి పదార్థ చలనానికి, సంచలనానికి హేతువిదే.

ఈ నాద ప్రభావంవల్లనే సృష్టి స్థితిలయలు మొదలయిన క్రియా బద్ధమైన గ్రహస్థితి వచ్చింది. ఏక కణంతో ప్రారంభమైన సృష్టి పరిణామం మనిషి దాకా ఎదిగి ఆ మనిషిని దైవత్వం వైపుగా నడిపించిన మహత్తర మహిమాన్విత శక్తే ఈ 'ఓం'.

ఈ చరాచర వర్తనం యొక్క సృష్టికి మూల విరాట్టు బ్రహ్మ అయితే, ఆ చతుర్భుజుని సంకల్ప మాత్రాన ఉద్భవించిన మహా మహులే సప్త ఋషులు. వీరే ఉప బ్రహ్మలు కూడా.

ఈ సృష్టి క్రమంలో సప్త సముద్రాలు పుట్టినాయి. అవి- లవణ, ఇక్షు, సురా, ఘ్రుత, దధి, క్షీర, జలసముద్రాలుగా ఖ్యాతిగాంచినాయి. సప్త ద్వీపాలు వెలసి వాయి.

అవి- జంబు, ప్లక్ష, కశ, క్రౌంచ, శాక, శాల్మల- పుష్కర ద్వీపాలుగా వాసి కెక్కినాయి. ఏడేడు పధ్నాల్గు లోకాలు పుట్టినాయి. వాటిని ఊర్ధ్వ, అధోలోకాలన్నారు.

అవి- భూ-భువర-స్వర్గ-మహర-జన-తపో- సత్యలోకాలు, అతల-వితల-సుతల-లులా తల-మహాతల-రసాతల పాతాళ లోకాలూ- వాటి సృష్టి క్రమాన్ని సంరక్షించేందుకు నవ బ్రహ్మలు పుట్టారు.

వారే- మరీచి, భరద్వాజ, అంగీరస, పులస్త్య, పులహు, క్రతువు, దక్షుడు, వశిష్ఠుడు, వాసుదేవుడు.

అష్ట దిక్పాలకుల అవసరము కల్గింది.

---

### చావా శివకోటి

---

ఆ తరువాత షట్ చక్రవర్తులు ఈ భూమిని ధర్మ బద్ధంగా పాలించి పునీతం చేశారు. వారే- హరిశ్చంద్రుడు, నలుడూ, కుత్సుడూ, పురూరవుడు, సగరుడూ, కార్తవీర్యార్జునుడూను.

ఈ భూమీ-దానిపై ఉద్భవించిన జీవి-సజీవంగా నిత్య కల్యాణంగా వుండేందుకు పంచ గంగలు ఈ భూమిపై ప్రవహించి వాయి.

గంగ, కృష్ణ, తుంగభద్ర, కావేరి, గోదావరి- ఆ గంగలు.

కశ్యపుడు-అత్రి-భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, వశిష్ఠుడు, జమదగ్నులను సప్తఋషులంటారు. సప్తఋషులనగానే సిద్ధాశ్రమం-గంగ యమునల సంగమం గుర్తుకొస్తుంది.

ఈ సిద్ధాశ్రమంలో

నరనారాయణులు-అనేక వేల సంవత్స రాలు తపస్సు చేశారు.

అక్కడే సప్త ఋషులూ తపమాచరించారు. హోమాలు చేశారు. యజ్ఞ యాగాదులు చేసి దేవతలకు హవిర్భాగాలిచ్చి వారిచే సమ శక్తులనూ ఆధీనంలో వుంచుకొనగలిగారు.

త్రిమూర్తులను సోధించి వారి సాక్షాత్కారం పొంది వారిచే పూజలందుకున్నారు. ఇంద్రుడు, అష్ట దిక్పాలకులూ, ముప్పైమూడు కోట్ల దేవతల చేత పూజింపబడిన మహా మహిమాన్వితులే సప్త ఋషులు.

'బ్రాహ్మణో మమ దేవతా:' అన్నారు 'నమో బ్రహ్మదేవాయ'- ఇది బ్రహ్మ మంత్రం.

'ఓం నమో నారాయణాయనమః ఇది అష్టాక్షర మంత్రం.

'ఓం నమః శివాయః' ఇది పంచాక్షరీ మంత్రం.

ఈ ఒక్కొక్క మంత్రాన్ని-వెయ్యి సంవత్సరాలు జపిస్తూ తపస్సు చేసి త్రిమూర్తులైన బ్రహ్మ-విష్ణు-మహేశ్వరుల సాక్షాత్కారాలు పొంది, వారిచే మన్నన లందిన మహాప్రస్థలు.

సృష్టికి మూలమైన బ్రహ్మగా నిలువగల మహామహులు.

వీరికున్న మూల ధనం- తపస్సు

వీరి ఆకాంక్ష సృష్టి యశస్సు.

వచ్చే వారం కశ్యపుడు




## వాయిదా!

శోభనం గదిలో నుంచి వచ్చిన తన ఫ్రెండ్ అభిజ్ఞని అడిగింది శ్వేత చలిపిగా "రాత్రంతా నిద్రపోలేదా?" అని.

"బాగా గుర్రుకొట్టి నిద్రపోయాను" బదులిచ్చింది అభిజ్ఞ.

"ఏం?"

"మా ఆయన వకీలు గదా... విషయాన్ని వచ్చే నెల ఆరవ తేదీకి వాయిదా వేశారు" చెప్పింది అభిజ్ఞ.

—వి.ఎస్.రెడ్డి, మద్రాసు



# ఆకర్షణ

— నీలిమా గోపీచంద్

ఒక్కసారిగా నాలోకి ఎంకి పాంగులాంటి వరదొచ్చింది. కిన్నెరసాని కిలకిలలు నా చెవులలో గింగురుమన్నాయి. సముద్రం పరుగెత్తి నా గుండెలలోకి ప్రవహించినట్టయింది. తొలి ప్రేమా సంరంభంలో మనస్సు మార్మోగింది.

అరుణ మోహిని నాటకం వెయ్యడానికి వచ్చిన మిగతా వేషగాళ్ళతో కలిసి మొట్ట మొదటిసారిగా మా వూళ్ళో వ్యాను దిగినప్పుడు ఆమెను చూసి నేను ఆపాదమస్తకం చలించిపోయాను. అదృశ్యంగా ఆమెలో కలిసిపోయాను.

శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా మా వూళ్ళో హడావిడి మొదలయింది. సాంస్కృతిక కార్యక్రమాలలో ఈసారి 'లవ కుశ' నాటకం వేస్తున్నారు.

మా నాన్న రామినాయుడు ఆ గ్రామానికి ప్రెసిడెంట్. అంతేగాక వూళ్ళో వున్న రాములువారి గుడికి ప్రధాన ధర్మకర్త. ఆయనే పట్టుబట్టి 'లవకుశ' వేయిస్తున్నాడు. గ్రామస్తులందరికీ 'చింతామణి' మీదే వుంది. మా నాన్నకు ఎదురుచెప్పలేరు.

సరే 'లవకుశ' వేయడానికి మా నాన్న పట్నం వెళ్ళి ఎక్కువ డబ్బులే ఇచ్చి ఈ అరుణమోహినీవాళ్ళ నాటక కంపెనీని బుక్ చేసుకొచ్చాడు. అరుణమోహిని అందులో సీత పాత్రధారట. ఆ వేషానికి ఆమె తప్పితే మా జిల్లాలో ఎవరూ సాటిరారంట. సీతే ఆమెట, ఆమె సీతంట. అలా నాటకం వెయ్యడానికని మా వూరొచ్చి నా హృదయంలో కల్లోలం రేపింది.

నేను పట్నంలోనే ఇంటర్ చదువుతుండేవాడిని. పరీక్షపోయేసరికి మళ్ళీ పరీక్షలకు సిద్ధం అవుదామని మా వూరొచ్చాను. ఆ రావడం ... రావడం ... ఇంతవరకూ పరీక్ష రాయడానికైతే మాత్రం పట్నం వెళ్ళలేదు. అప్పట్నించీ పొలాల మీదబడే తిరుగుతున్నాను.

ఇంకో రెండ్రోజులలో శ్రీరామ నవమి పండుగ. పండుగ రోజునే 'లవకుశ' వేస్తున్నారు. ఈ రోజు నాటక కంపెనీవాళ్ళు వూర్లో కొస్తున్నారని మా నాన్న చాటింపు వేయించినప్పట్నించీ, ఊరంతా ఏకమై వాళ్ళ కోసం ఎదురు చూస్తుంది.

మా పెద్ద బావగారు కోటేశ్వరరావుగారి మేడలో వాళ్ళని ఈ మూడ్రోజులు వుంచడానికి మా నాన్న నిశ్చయించారు. మొన్నటి వరకు ఆ మేడలో మా బావగారు, అక్కావాళ్ళు వుండేవారు. ఈ మధ్యనే వాళ్ళ పిల్లల చదువు కోసమని లంకంత మేడను వదిలేసి పట్నం వెళ్ళిపోయారు. అప్పట్నించీ అది ఖాళీగానే వుంటోంది.

ఆ మేడనిప్పుడు వీళ్ళ కోసమని తుడిపించి సిద్ధం చేయించాను నేను. ఆ మేడ మా ఇంటికి ఓ నాలుగైదు ఇళ్ళ అవతలగా వుంటుంది. దాన్ని దాటి కొంచెం పైకెళ్ళి కుడి పక్కకు తిరిగితే రాములవారి గుడి వస్తుంది.

ఒకపక్క గుడిలో అలంకరణలు, ఆర్భాటాలు జరిగిపోతున్నాయి. గుడి పక్కగానే నాటకం కోసమని ఓ పెద్ద స్టేజిని తయారు చేశారు. రంగురంగుల కాగితాలు అలంకరించారు. ఊళ్ళో వున్న ప్రతి ఒక్కడూ ఉషారుగా తిరుగుతున్నాడు. మా వూరు జగజ్జేయంగా వెలిగిపోతోంది.

నాటక కంపెనీ వచ్చేసింది. దాంతోపాటు అరుణమోహినీ దిగింది. నిజానికి అరుణమోహిని పెద్ద అందగత్తేంకాదు. కాని, ఏదో తెలియని ఆకర్షణ ఆమెలో వుంది. కనుబొమలు తమాషాగా ఎగరేస్తూ చికిలి చికిలిగా నవ్వుతుంది. ఆ కళ్ళలో నుంచి మైకపు కిరణాలు ప్రసరున దూసుకొచ్చి చూపరుల గుండెల్లో కసుక్కున నాటుకుంటాయి. అంతే ... అందరూ అలా ఆమెనే చూస్తుండిపోతారు.

మొదటిచూపులో ఆమె కలిగించిన ఆకర్షణ జ్వాల నుంచి నేను దహించుకుపోయి మసి అయ్యే సమయంలో మా నాన్న అరిచిన అరుపుకు చటుక్కున తేరుకుని వాళ్ళకి మేడలోకి దారి చూపించాను. మా బావగారి మేడలో కింద చాలా గదులున్నాయికానీ, పైన మాత్రం రెండు గదులే వున్నాయి. ఈ వచ్చిన వేషగాళ్ళలో నలుగురు ఆడవాళ్ళు వున్నారు. మగవాళ్ళకు కింది గదులు చూపించి ఆడవాళ్ళను సవినయంగా పైకి తీస్కెళ్ళాను.

ఇంతసేపూ నేను అరుణమోహినిని క్రీగంట గమనిస్తూనే వున్నాను. నడుస్తున్నప్పుడు ఆమె సన్నటి నడుము దగ్గర యవ్వనం ప్రతిబింబిస్తున్న మడతలలో నా కళ్ళు ఇరుక్కుపోయాయి. అక్కడ నా కళ్ళలో సూర్యోదయాలు వికసించాయి. మెట్లెక్కుతున్నపుడు బరువుగా పైకీ కిందకీ ఊగుతున్న ఆ వక్ష సంపదను చూస్తే ఒళ్ళంతా కోరికైపోతుంది. నేను వాళ్ళ పక్కన నడుస్తున్నానన్న మాటేగాని, నేను నాలో లేను. అరుణమోహిని ఆకర్షణలో ఆవిరైపోతున్నాను.

ఆమె మాత్రం ఏవో పద్యాలనుకుంటూ లోగొంతుకలో సాగదీస్తోంది. అప్పుడప్పుడూ నన్ను గమనిస్తోంది. ఓరకంటతో వాళ్ళను గదుల్లోకి పంపి నేను అక్కడ్నించి వచ్చేశాను ఇంకొద్ది సేపు ఆమె పక్కనే వుంటే ఏం చేస్తానో అని భయమేసి.

కిందికొచ్చేసరికి మా ఫ్రెండు రామోజీ కనిపించాడు. వాడు ఆ నాటకంవాళ్ళను గురించి ఏమన్నా చెబుతానేమోనని ఉత్సాహంగా చూశాడు నా వెంట. నేనేం మాట్లాడకుండా మేడ వెనకపక్కకి నడిచాను. వాడు కూడా నా వెనకే వచ్చాడు.

ఆ మేడ వెనక గొడ్లసావిడి ఒకటుంది. ఆ సావిడి మూలగా కూర్చుని జేబులో నుంచి సిగరెట్టు తీసి వెలిగించాను. అది నా రహస్య స్థావరం. అక్కడ కూర్చుంటే మేడ వెనకకు వచ్చి చూసినవాళ్ళకు కూడా కనపడం. నేనూ, నా ఫ్రెండ్స్ సిగరెట్లు తాగడానికి ఎప్పుడూ అక్కడకే వస్తాం.

సిగరెట్టు దమ్ము గట్టిగా పీల్చి వదిలాను. రామోజీ నన్నే చూస్తున్నాడు. ఇప్పుడు వాడి చూపంతా నేను తాగే సిగరెట్టు మీదే వుంది. అది సగం వరకు ఎప్పుడు కాలుతుందా, నేను దాన్ని వాడికి ఎంత తొందరగా ఇస్తానా అని గోతికాడి నక్కలా ఆశగా చూస్తున్నాడు.

నేను గబగబా నాలుగు దమ్ములు పీకి వాడి మీదకు విసిరేశాను. "మహాప్రసాదం రాజా"! అన్నట్టు వాడు దాన్ని రెండు చేతులతో అందుకున్నాడు. ఒక్క దమ్ములాగి



క్యారే బచ్చా అన్నట్టు చూశాడు నన్ను.

ఇంకో దమ్ము కూడా లాగి వాడు 'ఆ పిల్ల గుంట భలే రంజుగా వుంది కదూ' అన్నాడు. ఒళ్ళంతా మండుకొచ్చింది నాకు. వాడి మాట గడ్డిపోచతో సమానమన్నట్టు ముఖంలో ఓ ఫీలింగ్ పెట్టి నేను చూపులు పక్కకు తిప్పేశాను.

చివరి దమ్ము కూడా లాగి సిగరెట్టును విసిరేస్తూ వాడు 'దాన్ని మేడ పైగదిలో దించినట్టున్నావ్' అన్నాడు. నేను పైకి లేచి 'కింద బసిరిగాడ్ని కాపలా పెట్టి వచ్చాను' అని అక్కడ్నుంచి వచ్చేశాను. వెనక వెర్రి ముఖమేసుకుని చూస్తుండే రామోజీని తలచు కొని పొట్ట చెక్కలయ్యేలా నవ్వొచ్చింది.

బసిరిగాడు మా పెద్దపాలేరు. వాడ్ని చూస్తే మా వూరంతా హడలే. దారాసింగ్ తమ్ముళ్ళా వుంటాడు. ఒక చేత్తో విసిరా డంటే మచిలీపట్నం సముద్రంలోనే మళ్ళీ తేలేది.

నేను మేడ ముందుపక్కకొచ్చేసరికి గేటు దగ్గర మా నాన్న నాటకం వాళ్ళ భోజనాల గురించి అనుకుంటూ ఊళ్ళో వాళ్ళతో తెగ చర్చించేస్తున్నాడు. నేను మేడ పైకి చూశాను. అరుణమోహిని అక్క డెక్కడా కనపడలేదు. ఇంకోసారి ఆమెను చూడాలనిపించింది. పైకెళ్దామా అనుకుం టుండగా మా నాన్న పిలిచాడు.

కొద్దిసేపు అక్కడే వుండి ఆ ఏర్పాట్లు, ఈ ఏర్పాట్లు చేసి నేను, మా నాన్న ఇంటి కెళ్ళిపోయాం భోంచేయడానికి. మేడ దగ్గ రకు రావడానికి మళ్ళీ సాయంకాలం వరకు కుదరలేదు.

నాకు ప్రతిక్షణం అరుణమోహిని గుర్తొ స్తూనే వుంది. ఆమె చిలిపి నవ్వు నన్ను తడుముతూనే వుంది. ఆమె యవ్వన మహానన నన్ను తాకుతూనే వుంది. ఆమె నడుస్తున్నప్పుడు మోగే మువ్వల శబ్దం నన్ను చేరుతూనే వుంది.

సాయంకాలం కొంచెం పొద్దుగూకినాక మేడ దగ్గరకు చేరుకున్నాను. క్రింది గదుల్లో నుంచి తీవ్ర స్థాయిలో పద్యాలు, పాటలు వినిపిస్తున్నాయి. ఆరువ్వాక్కరాగంలో అందరూ ఏకకాలంలో ఆలపిస్తున్నారు కలగాపులగంగా. పరాయి దేశంపై యుద్ధ భేరి మోగించినట్టుంది అక్కడి వాతావరణం. నేను పైకి చూశాను. అక్కడెవరూ కనపడ లేదు. అక్కడ్నుంచి కూడా సన్నగా పాటలు వినిపిస్తున్నాయి. మధ్యలో మృదంగాల మోతలు, గజ్జెల గలగలలు మేడంతా అదిరి పోతోంది.

కింద నుంచి పైకెళ్ళే మెట్ల దగ్గర బసిరి గాడు కూర్చుని చుట్ట తాగుతున్నాడు. వాడ్ని చూసి నవ్వుకుంటూ అక్కడ్నుంచి కదిలి మేడ వెనక్కి చేరుకున్నాను. గొడ్లసావిడిలో కూర్చుని సిగరెట్టు అంటించాను. నా మిత్రులు ఎవరూ రాలేదు. అమ్మయ్య అను కున్నాను. మత్తుగా సిగరెట్టు తాగుతున్నాను.

ఇంతలో మేడ వెనుక పక్క నుంచి మెరుపు మెరిసినట్టయింది. కళ్ళు నులుము కుని మరీ చూశాను. మసక తెరలలో నుంచి అరుణ మోహిని రూపం అద్భుతంగా ప్రత్యక్షమైంది.

ఒక్కసారి గుండెను గట్టిగా పట్టుకున్నాను. అరుణమోహిని!! అరుణమోహిని తల స్నానం చేసి జుట్టు ఆరబోసుకుంటోంది. తల పక్కకు వంచి రెండు చేతుల్తో జుట్టు నలుపు తోంది. నల్లటి పొడవాటి జుట్టు చీకటి తెరలా ఆమె ముఖం మీద వూగుతోంది. ఆ వూగిసలాటలో ఆమె కళ్ళు ఒకసారి కనిపిస్తు న్నాయి, మరొకసారి జుట్టు వాటిని కప్పే స్తోంది.

అప్పుడే స్నానం చేసి వచ్చింది కాబోలు జాకెట్టంతా తడిసిపోయి వుంది. పైనున్న లైటు కాంతి ఆమెమీద పడి పరావర్తనం చెందుతోంది. రెండు చేతుల్తో జుట్టు పట్టు కొని తల పైకెగురవేస్తోంది. నీటి బిందువులను దులిపేస్తోంది. అలా మేడ మీద తిరుగుతోంది.

ఆమెను చూస్తుంటే నాకు వేరే ప్రపంచం అక్కర్లేదనిపిస్తోంది. ఇక్కణ్నుంచి ఒక్క సారిగా మాయమై అక్కడ ప్రత్యక్షమైతే...

రాగాన్నాలపిస్తున్న ఆమె పెదవులపై కాలిపోతున్న నా పెదవులను అతికిస్తే ... చెమటతో వుబుకుతున్న ఆమె సౌందర్య వాసనను నావంటి నిండా అద్దిమ్చుకుంటే... ఓహో! ఆమె అక్కడ్నుంచి వెళ్ళిపోయింది. నన్ను ఒంటరివాడ్ని చేసి ఆమె మరో లోకం లోకి పారిపోయింది.

నేనిక చేసేదేంలేక మరో సిగరెట్టు తాగి అక్కడ్నుంచి వచ్చేశాను. వచ్చేటప్పుడు బసిరి గాడితో చెప్పాను రాత్రిపూట ఎవ్వర్నీ పైకి వెళ్ళనీయొద్దని.

ఆ రోజు రాత్రి నాకు నిద్దరలేదు. ఆమెతో ఎలాగైనా మాట్లాడాలి. నా ప్రేమను ఆమెతో పంచుకోవాలి. నా బాధను ఆమెకు విన్నవించుకోవాలి. సున్నితమైన ఆ చేతిని ముట్టుకోవాలి. పువ్వులాంటి చెక్కిళ్లను నిమరాలి. ఆర్తిగా గుండెకు హత్తుకోవాలి. ఇలాంటి కోర్కెలతో కాలిపోతున్నాను.

మరునాడు పొద్దున్నే మా నాన్న నన్ను పిలిచి మేడలో వాళ్ళకి టిఫిన్లూ అవీ సరిగ్గా అందుతున్నాయో లేదో వెళ్ళి చూసి రమ్మ న్నాడు. ఒక్క ఊపు మీద బయల్దేరాను. దారిలో బడ్డీకొట్టు దగ్గర రెండు సిగరెట్లు కొనుక్కొని మరీ వెళ్ళాను.

ముందర మేడ వెనక్కి గొడ్ల సావిట్లోకి వెళ్ళి ఓ సిగరెట్టు కాల్చుకుని ఆ తర్వాత మేడలోపలికి వెళ్ళాను. కింద మగవాళ్ళం దరూ టిఫిన్లు దట్టించి కిళ్ళీలు వేసుకుని మరీ డైలాగులు సాధన చేస్తున్నారు. హను మంతుడిగా వేసే ఆయన కోతిలాగా గంతులు వేస్తూ గదంతా తిరుగుతూ ఏమిటేమిటో మాట్లాడుతున్నాడు. ఒకాయన అలాకాదు ఇలా అని ఏదో చెబుతున్నాడు హనుమంతు డితో. అంతా కంగాళీగా అరుస్తున్నారు. వాళ్ళందరి దగ్గరకీ అలా ఓ ట్రిప్పువేసి నెమ్మదిగా పైకెళ్ళాను. బసిరిగాడు నన్ను చూసి వెధవ నవ్వొకటి నవ్వాడు.

మొదటి గదిలోనే వుంది అరుణమోహిని. మంచం మీద పడుకుని ఇంకో అమ్మా యితో ఏదో మాట్లాడుతోంది. మధ్యలో గట్టిగా నవ్వుతుంది. ముందుగా ఆ అమ్మాయే నన్ను చూసింది. పలకరింపుగా నవ్వింది. ఏమిటన్నట్టు చూసింది.

నేను తడబడుతూ, 'ఏం లేదు ... టిఫిన్ చేశారో లేదో కనుక్కుందామని వచ్చా' నన్నాను. అరుణమోహిని నా వంక చూసింది. నేను అప్పటిదాకా ఆమెను చూస్తున్నవాణ్ని పక్కకి చూపులు తిప్పాను. పక్కనున్న అమ్మాయి వంక సమాధానం కోసమా అన్నట్టు చూశాను.

ఆ పక్కనున్న అమ్మాయి, 'అన్నీ బాగానే వున్నయ్యి, కొంచెం కిళ్ళీలు తెచ్చి పెట్టమనండి' అంది. ఇప్పుడే తెచ్చిస్తాను అన్నాను. అరుణమోహిని వంక చూశాను. కనురెప్పలు కొట్టుకుంటూ చిలిపి చిలిపిగా నవ్వుతుంది. వళ్ళు జల్లుమంది. గొంతు పెగల్చుకుని 'మీకు....?' అని నసుగు తున్నాను.

'మల్లెపూలు దొరికితే తెచ్చిపెట్టండి' అంది అరుణమోహిని సమ్మోహనమైన గొంతుకతో. నాకు గుటక పడడం లేదు. ఓ సన్నని బొప్పాసి గొట్టంలో పంచదార నీళ్ళు పోసి ఒక పక్కనుంచి గట్టిగా వుఫ్‌మని వూదితే అవతలిపక్కకు కురిసే సన్నటి పన్నీటి జల్లులా తీయతీయగా ఆమె మాట నా చెవులకు చేరింది. ఇక అక్కడితో లెచ్చి పోయాను. ఇప్పుడే వస్తానని చెప్పి దూకుడు మీద బయల్దేరాను.

మొత్తం మా వూళ్ళో వున్న మల్లె చెట్లన్నీ దులిపి పారేశాను. కొంతమంది గొణుక్కుం



